ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
10-08-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 339 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి

# తెలంగాణ.. ఫ్యూచర్ స్టేట్



- మన లక్ష్యం సూచించే కొత్త నినాదం
- ట్యాగ్ లైన్ ఖరారు చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- కాలిఫోర్నియాలో ఏఐ యూనికార్న్ కంపెనీ ప్రముఖులతో సమావేశం

**జయభేరి, హైదరాబాద్ :**

**ఇకపై మన తెలంగాణ రాష్ట్రాన్ని.. తెలంగాణ ఫ్యూచర్ స్టేట్ అని పిలుద్దామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ పునర్నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్, నెట్ జీరో సిటీ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో తెలంగాణ రాష్ట్రం "ది ఫ్యూచర్ స్టేట్"కు పర్యాయపదంగా నిలుస్తుందని సీఎం ప్రకటించారు.**

కాలిఫోర్నియాలో ఇండియన్ కాన్సులేట్ జనరల్ నిర్వహించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బిజినెస్ రౌండ్‌టేబుల్‌లో టెక్ యునికార్న్స్ సీఈఓలను ఉద్దేశించి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఐటీ యూనికార్న్ ప్రతినిధులందరూ తెలంగాణకు రావాలని ఆహ్వానించారు. 'మీ భవిష్యత్తును ఆవిష్కరించుకొండి. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం" అని పిలుపునిచ్చారు. 'ఇప్పటి వరకు మేము న్యూయార్క్, న్యూ జెర్సీ, వాషింగ్టన్ డీసీ, టెక్సాస్‌లో పర్యటించాం. ఇప్పుడు కాలిఫోర్నియాలో ఉన్నాం. అమెరికాలో ప్రతి రాష్ట్రానికి ఒక ప్రత్యేక లక్ష్యం.. ఆ లక్ష్యాన్ని సూచించే నినాదం ఉంది. అవుటాఫ్ మెనీ.. వన్ అనేది న్యూయార్క్ స్టేట్ నినాదం. టెక్సాస్‌ను లోన్ స్టార్ స్టేట్ అని పిలుస్తారు. కాలిఫోర్నియాకు యురేకా అనే నినాదం ఉంది. మన దేశంలో రాష్టాలకు ఇటువంటి ప్రత్యేక నినాదాలేమీ లేవు. ఇప్పటినుంచి మన తెలంగాణ రాష్ట్రానికి అటువంటి ఒక లక్ష్య నినాదాన్ని ట్యాగ్ లైన్ గా పెట్టుకుందాం. ఇకపై మన రాష్ట్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ స్టేట్.. అని పిలుద్దాం..' అని సీఎం ప్రకటించారు.

ప్రపంచ టెక్ పరిశ్రమలకు తెలంగాణలో అనుకూలమైన వాతావరణం ఉందని మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలను తమ ప్రభుత్వం అనుసరిస్తుందని స్పష్టం చేశారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యునికార్న్ కంపెనీల వ్యవస్థాపకులు స్వయంగా హైదరాబాద్‌ను సందర్శించాలని మంత్రి ఆహ్వానించారు. అక్కడ పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, సదుపాయాలను పరిశీలించాలని కోరారు.



# బీజేపీ, బీఆర్ఎస్ విలీనం సాధ్యమేనా..?

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 9:**

తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని డీల్ ఫైనల్ అయిపోయిందని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగుదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది.కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్రపూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గత నెలలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్‌రావు

...మిగతాది 2 లో

# మద్యం పాలసీలోనే రిజర్వేషన్లు



**జయభేరి, విజయవాడ, ఆగస్టు 9:**

ఆంధ్రప్రదేశ్‌లో లిక్కర్ పాలసీ మారబోతోంది. అక్టోబర్ ఒకటో తేదీ నుంచి కొత్త పాలసీ అమల్లోకి తేవాలని చంద్రబాబు నిర్ణయించారు. ఇప్పుడున్న విధానానికి పూర్తి స్థాయిలో మార్పు ఉండబోతోంది. ఇప్పుడు ప్రభుత్వమే దుకాణాలు అద్దెకు తీసుకుని సిబ్బందిని నియమించుకుని.. సొంతంగా అమ్మకాలు చేస్తోంది.ఈ క్రమంలో ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. స్వయంగా చంద్రబాబు కూడా సీఐడీ విచారణకు ఆదేశించారు. అందుకే పాలసీలో మార్పు ఖాయమయింది. అధికారులు ఇతర రాష్ట్రాల్లో విధానాలను పరిశీలిస్తున్నారు. అయితే కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు మద్యం దుకాణాల కేటాయింపుల్లో కొన్ని సామాజిక తరగతులకు రిజర్వేషన్ కల్పించాలని చెప్పడంతో.. దుకాణాల వేలం పాట ఖాయమన్న అభిప్రాయం వినిపిస్తోంది. మద్యం దుకాణాల కేటాయింపుల్లో కొన్ని సామాజిక తరగతులకు రిజర్వేషన్

...మిగతాది 2 లో



# జీవో 33 పై ఆందోళన

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 9 :**

రాష్ట్రంలోని మెడికల్(ఎంబీబీఎస్, బీడీఎస్) అడ్మిషన్లలో స్థానికతపై చర్చ నడుస్తోంది. ప్రధానంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ.... కొన్ని అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. జీవో 33తో స్థానిక అభ్యర్థులు నాన్ లోకల్ గా మారుతున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. వెంటనే ప్రభుత్వం జీవోను వెనక్కి తీసుకోవాలని... విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోంది.ఇదే విషయంపై అధికార కాంగ్రెస్ లోని నేతలు స్పందిస్తూ... బీఆర్ఎస్ ఆరోపణలను తిప్పికొడుతోంది. పాత జీవోలోనే కొన్ని మార్పులు చేశామని చెబుతోంది. ఈ విషయంపై రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కీలక ప్రకటన

...మిగతాది 2 లో

# కవిత విషయంలో ఏం జరుగుతోంది..! జైలా.. బెయిలా..?



**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 9 :**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తనయ, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. ఢిల్లీ మద్యం కుంభకోణంలో మార్చి 15న అరెస్టు అయిన ఆమె ప్రస్తుతం తిహార్ జైల్లో ఉన్నారు. అరెస్టు అయిన నాటి నుంచి ఆమె బెయిల్ కోసం అనేక ప్రయత్నాలు చేశారు. ప్రత్యేక కోర్టు బెయిల్ నిరాకరించడంతో ఢిల్లీ హైకోర్టును కూడా ఆశ్రయించారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా బెయిల్ రాకపోవడంతో సుప్రీం కోర్టులు ఆశ్రయించాలని కవిత సోదరుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్‌రావు ఢిల్లీలో న్యాయ నిపుణులతో మంతనాలు జరిపారు. కానీ, ఇంకా పిటిషన్ వేయలేదు. ఈ క్రమంలో రౌస్ అవెన్యూ కోర్టులో డీఫాల్ట్ పిటిషన్ రెండు రోజుల క్రితం విచారణకు వచ్చింది. ఆరోజు కవిత తరపు న్యాయవాదులు అందుబాటులో లేకపోవడంతో

...మిగతాది 2 లో

# హస్తగతమైన పీర్జాదిగూడ మేయర్ పీఠం

- మేయర్ అభ్యర్థిగా అమర్ సింగ్ ను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ
- 21 మంది కార్పొరేటర్లు అవిశ్వాసానికి మద్దతు
- ఐదుగురు హాజరుకాని బిఆర్ఎస్ కార్పొరేటర్లు
- మేయర్ గా అమర్ సింగ్ కలెక్టర్ తేదీ ప్రకటించగానే ప్రమాణస్వీకారం చేసే అవకాశం



2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## విలీనం సాధ్యమేనా..?

ఢిల్లీకి వెళ్లారు. కొన్ని కీలక సమావేశాలు ఉన్నప్పటికీ వారు ఢిల్లీలో మకాం వేశారు. దాదాపుగా వారం రోజుల పాటు ఢిల్లీలో ఉన్నారు. ఎవరితో సమావేశమయ్యారో ఎవరికీ తెలియదు. వారు కూడా చెప్పలేదు. వీరి ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇప్పుడు తాజాగా మరోసారి కేటీఆర్, హరీష్‌రావు ఢిల్లీకి వెళ్లారు. ఒక్క రోజు కొంత సేపు కవితతో తీహార్ జైల్లో ములాఖత్ అయ్యారు. మిగిలిన రోజుల్లో ఏం చేస్తున్నారో .. ఎవరితో సమావేశం అవుతున్నారో స్పష్టత లేదు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లుగా ఓ సారి ఫోటో రిలీజ్ చేశారు. అందు కోసం రోజుల తరబడి అక్కడ ఉండాల్సిన అవసరం లేదు. వీరు బీజేపీ పెద్దలతో రహస్యంగా విలీన ప్రతిపాదనపై చర్చలు జరుపుతున్నారన్న బలమైన సమాచారం బయటకు రావడంతో కొంత మంది నేరుగా ఈ విషయాన్ని ప్రచారం చేస్తున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి విలీనం చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్ధంగా లేరు. కీలక నేతలు ప్రతి రోజూ తెలంగాణ భవన్ లో ప్రెస్మీట్లు పెడుతున్నారు కానీ.. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. కేటీఆర్ కూడా ఓ ట్వీట్ పెట్టారు కానీ.. బీజేపీతో ఎలాంటి సంబంధాలు ఉండవని చెప్పడం లేదు. తెలంగాణ కోసం పోరాడతామని చెబుతున్నారు. అది బీఆర్ఎస్ పార్టీ ద్వారానేనా అన్నదానిపై బెనిఫిట్ ఆఫ్ డౌట్ అన్నట్లుగా స్పందిస్తున్నారు. బీఆర్ఎస్ మాత్రమే కాదు..అసలు బీజేపీ కూడా స్పందించడం లేదు. బీజేపీ నేతలు స్పందించినా కాస్త క్లారిటీ ఉండేది. కానీ స్పందించడానికి వారు కూడా వెనుకడుగు వేస్తున్నారు. అంటే నిప్పు లేనిదే పొగ రాదన్నట్లుగా ఢిల్లీలో ఏదో జరుగుతోందని సులువుగా అర్థమైపోతుంది. స్వయంగా మజ్లిస్ పార్టీ చీఫ్ అసుద్దీన్ కూడా ఈ అంశంపై బీఆర్ఎస్‌ను ప్రశ్నించినా స్పందన లేదు. నిజానికి బీజేపీ, బీఆర్ఎస్ మధ్య పొత్తు లేదా విలీనం అంశంపై చాలా కాలంగా చర్చలు జరుగుతున్నాయని బీఆర్ఎస్సే నేరుగా ప్రతిపాదన పెట్టినా.. తెలంగాణ బీజేపీ నేతల్లో ఏకాభిప్రాయం లేకపోవడం వల్లనే డీల్ ఆలస్యమవుతోందని ఢిల్లీ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. బీఆర్ఎస్‌తో తీవ్రంగా పోరాడిన ముగ్గురు ఎంపీలు ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకున్నా సరే అది బీజేపీకి నష్టం చేస్తుందని గట్టిగా వాదిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని..కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని .. ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. ఈ కారణంగానే చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందని వ్యతిరేకించే వారిని .. సముదాయించి అధికారిక ప్రకటన చేస్తారని చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని అనుకుంటున్నారు. భారత రాష్ట్రసమితిని కేసీఆర్ ఓ రకంగా శూన్యం నుంచి పుట్టించారు. పిడికెడు మందితో ప్రస్థానం ప్రారంభించారు. అలాంటి పార్టీని ఆయన దేశంలోనే ప్రముఖ ప్రాంతీయ పార్టీగా మార్చారు. మరి ఇప్పుడు ఒక్క ఓటమికే ఆయన తన పార్టీని బీజేపీలో విలీనం చేస్తారా ? అని ఆలోచిస్తే.. చాన్సే ఉండదని ఎవరికైనా అర్థమవుతుంది. ప్రధాన ప్రతిపక్షంలో ఉంది బీఆర్ఎస్ పార్టీనే. దాదాపు 39 శాతం ఓట్ షేర్ సాధించింది అసెంబ్లీ ఎన్నికల్లో. రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తే కచ్చితంగా 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ దే అధికారం. అదే సమయంలో బీఆర్ఎస్‌కు నాయకత్వ సమస్య లేదు. కేసీఆర్ మళ్లీ మైక్ పట్టి..రోడ్లపైకి వస్తే ఆయన క్రేజ్ ఆయనదే. ఇంకో 10 పదేళ్లు ఆయన యాక్టివ్ పాలిటిక్స్ ఉండగలరు. నీ భవిష్యత్ లీడర్లు గా ఒకరు కాదు ఇద్దరు కనిపిస్తున్నారు. హరిశ్ రావు, కేటీఆర్ లు ఆల్ రెడీ ప్రూవెన్ లీడర్స్. కేసులు.. ఆర్థిక పరిస్థితి ఇలా ఏం చూసినా బీఆర్ఎస్ పార్టీని విలీనం చేయడం అనే సమస్యే ఉండదని బీఆర్ఎస్ క్యాడర్ గట్టి నమ్మకం.ఓ వైపు క్యాడర్.. మరో వైపు పార్టీ భవిష్యత్ మధ్య బీఆర్ఎస్ అగ్రనాయకత్వం ఊగిసలాడుతోంది. ఏ నిర్ణయం తీసుకున్నా తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులు ఖాయమని అనుకోవచ్చు...

## మద్యం పాలసీలోనే రిజర్వేషన్లు

కల్పించాలని చంద్రబాబు త్వరలో ప్రకటించనున్న నూతన మద్యం పాలసీలో ఈ మేరకు ప్రతిపాదించనున్నారు. సంప్రదాయంగా కల్లుగీత వృత్తిలో ఉంటున్న వారు గతంలో మద్యం దుకాణాల నిర్వహణలో ఎక్కువగా ఉండేవారు. అయితే మధ్యలో బడా వ్యాపారులు చొరబడటంతో వారి ప్రాధాన్యం తగ్గిపోయింది. గత ప్రభుత్వం పాలసీని మార్చేయడంతో ఎవరికీ అవకాశం రాలేదు. ఈ సారి గౌడ, ఈడిగలకు ప్రాధాన్యత ఇచ్చేలా మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్ విధానాన్ని అమలుచేయాలని చంద్రబాబు నిర్ణయించారు. సోమవారం జరిగిన కలెక్టర్ల రాష్ట్రస్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా ఈ దిశలో కొన్ని సూచనలు చేశారు. గౌడ, ఈడిగ సామాజిక తరగతులవారు సాంప్రదాయంగా కల్లు విక్రయాలు చేస్తారని, వారికి మద్యం షాపుల్లో 15 నుంచి 20 శాతం షాపులను కేటాయించే అంశంపై ఆలోచన చేయాలని ఆయన సూచించారు. గత ఎన్నికలకు ముందు మద్యం దుకాణాల వేలం పాటను నిర్వహించిన కేసీఆర్ ప్రభుత్వం ఎక్సైజ్ చట్టంలో మార్పులు చేసింది. తెలంగాణా ఎక్సైజ్ చట్టం 1968 లోని సెక్షన్ 17 (1 ) (V) అనుసరించి ప్రభుత్వ ఏ 4 రిటైల్ షాపుల లైసెన్సులను 2021 23 సంవత్సరానికి గాను రిజర్వేషన్లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గౌడ్‌లకు 15 శాతం, షెడ్యూల్డు కులాలకు 10 శాతం, షెడ్యూల్డు తెగలకు 5 శాతం కేటాయించారు. ఆ నిబంధనల ప్రకారమే .. జిల్లాల వారీగా రిజర్వేషన్లు అమలు చేశారు. లాటరీ తీసి దుకాణాలను ఆయా సామాజికవర్గాల వారీగా కేటాయించారు. ఆ ప్రకారం వేలం నిర్వహించారు. ఈ కారణంగా ఆయా వర్గాల నుంచి కొంత మంది మద్యం దుకాణాలు దక్కించుకోగలిగారు. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు ఇచ్చేలా ఆరు రాష్ట్రాల్లో మద్యం విధానాన్ని అధ్యయనం చేసేందుకు నాలుగు కమిటీలను ఏర్పాటు చేసింది. ఉత్తర ప్రదేశ్, రాజస్తాన్, కేరళ, తమిళనాడు, తెలంగాణా, కర్నాటక రాష్ట్రాల్లో ఆయా కమిటీలు అధ్యయనాన్ని ప్రారంభించింది. ఆ కమిటీలు ఈ నెల 12 తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నాయి. ఆ నివేదిక ఆదారంగా రాష్ట్రంలో కొత్త మద్యం పాలసీని రాష్ట్రప్రభుత్వం రూపొందించనుంది. ఇక ప్రభుత్వ రంగంలో ఎంత మాత్రం దుకాణాలు సాగే అవకాశం లేదు. వేలం పాట నిర్వహించడం ఖాయమని అనుకోవచ్చు. ఈ దిశగా అధికారులు ఇచ్చే నివేదికలను ఆమోదించిన తర్వాత .. రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోనున్నారు. గౌడ, ఈడిగ కులాలకే కేటాయిస్తారా లేకపోతే ఎస్సీ , ఎస్టీలకూ కేటాయిస్తారా అన్నది అప్పుడు తేలే అవకాశం ఉంది.

## జైలా.. బెయిలా..?

బుధవారానికి కోర్టు వాయిదా వేసింది. ఇంతలో ఏమైందో ఏమో.. పిటిషన్ విచారణకు ముందే.. కవిత తరఫు లాయర్లు డిఫాల్ట్ పిటిషన్ ఉపసంహరించుకున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కోర్టును ఆశ్రయిస్తామని న్యాయవాదులు తెలిపారు. దీనిపై ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎలాగో బెయిల్ రాదని ఉపసంహరించుకున్నారా.. లేక కావాలనే కొన్ని రోజులు జైల్లో ఉండేందుకు ఉపసంహరించుకున్నారా అన్న చర్చ జరుగుతోంది.ఇదిలా ఉంటే.. సీబీఐ ఛార్జిషీట్‌లో తప్పులున్నాయని పేర్కొంటూ, జులై 6న కవిత డీఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఎలాంటి తప్పులు లేవని సీబీఐ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో సీబీఐ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు జులై 22న ప్రత్యేక కోర్టు ప్రకటించింది. ఈనెల 9న దీనిపై విచారణ జరపనుంది. అయతే ఈ పిటిషన్‌ను ఉపసహరించుకోవడంతో ఇక విచారణ క్లోజ్ చేసే అవకాశాలున్నాయి.. ఇదిలా ఉంటే.. ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను ఈడీ మార్చి 15న అరెస్టు చేసింది. ముందుగా తనిఖీలు చేసిన ఈడీ తర్వాత సాయంత్రం 5:30 గంటలకు అరెస్టు చేసినట్లు ప్రకటించింది. అదేరోజు సాయంత్రం విమానంలో ఢిల్లీ తీసుకెళ్లింది. మరుసటి రోజు కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించింది. ఇక విచారణ కొనసాగుతున్న సమయంలో సీబీఐ కూడా రంగంలోకి దిగింది ఏప్రిల్ 11న కవితను జైల్లోనే సీబీఐ కూడా అరెస్ట్ చేసింది. కస్టడీలోకి తీసుకుని విచారణ చేసింది.విచారణ పూర్తి కావడంతో సీబీఐ, ఈడీ రెండూ చార్జిషీట్లను ప్రత్యేక కోర్టులో దాఖలు చేశాయి. అయినా బెయిల్ మాత్రం రావడం లేదు. బెయిల్ ఇవ్వొద్దని దర్యాప్తు సంస్థలు కోర్టును కోరుతన్నాయి. కవిత సామాన్యమైన వ్యక్తి కాదని, బలమైన రాజకీయ నేపథ్య ఉందని, ఆమె బయటకు వస్తే సాక్షాలను తారుమారు చేస్తారని తెలుపుతున్నాయి. గతంలో డిజిటల్ ఎవిడెన్స్ అయిన ఫోన్లను ధ్వంసం చేశారని కోర్టు దృష్టికి తెస్తున్నాయి. దీంతో కోర్టులు కూడా దర్యాప్తు సంస్థల వాదనతో బెయిల్ నిరాకరిస్తున్నాయి. ఈ క్రమంలో ఆమె తాజాగా డీఫాల్ట్ బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడం ఇపుపడు చర్చనీయాంశమైంది.

# హస్తగతమైన పీర్జాదిగూడ మేయర్ పీఠం

✍ జయభేరి, మేడిపల్లి :



పీర్జాదిగూడ నగర మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. కార్పొరేషన్ లో మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా అవిశ్వాసానికి 21 మంది కార్పొరేటర్లు మద్దతుగా నిలిచారు. గత 8 నెలలుగా సందిగ్ధంలో ఉన్న అవిశ్వాస తీర్మానం ఎట్టకేలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నెగ్గింది. దీనితో మేయర్ గా కొనసాగిన జక్కా వెంకట్ రెడ్డి పదవిని కోల్పోయాడు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గా జక్కా వెంకట్ రెడ్డి నాలుగున్నర సంవత్సరాలు పరిపాలించగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. శుక్రవారం ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి సమక్షంలో అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ కార్పోరేటర్లు 21 మంది సై అన్నారు. దీనితో మేయర్ జక్కా వెంకటరెడ్డి పదవి జారిపోయింది. కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మేయర్ అభ్యర్థిగా అమర్ సింగ్ ను ఎన్నుకున్నారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకార తేదీని ప్రకటించగానే 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్ సింగ్ మేయర్ గా ప్రమాణ స్వీకారం చేస్తారని 20 కార్పొరేటర్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ లు చక్రం తిప్పుతూ బిఆర్ఎస్ పార్టీలో ఉన్న కార్పొరేటర్ లను తమ వైపు తిప్పుకోవటంలో సఫలీకృతులయ్యారు. డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ తో సహా 20 మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరి మేయర్ పై వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం పెట్టారు. దీనితో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి పంతం నెగ్గినట్లుగా ప్రజలు భావిస్తున్నారు. అవిశ్వాస తీర్మానం నెగ్గగానే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి జై కాంగ్రెస్.. జై రేవంత్ రెడ్డి.. జై సుధీర్ రెడ్డి.. అంటూ నినాదాలు ఇచ్చారు.

గత నాలుగున్నర సంవత్సరాలు మేయర్ గా పనిచేసిన వెంకట్ రెడ్డి ఒంటెద్దు పోకడలతో కార్పొరేషన్ ఆదాయాన్ని భ్రష్టు పట్టించాడని తెలిపారు. సొంత డబ్బులతో పని చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వ లేని పరిస్థితిలో ఉందని అన్నారు. గొప్పలకు పోయి ఖజానాను మొత్తం లూటీ చేసిన ఘనత జక్కా వెంకటరెడ్డికి దక్కుతుందని అన్నారు. ఏది ఏమైనా పిర్జాదిగూడ నగర ప్రజలకు చీకటి రోజులు పోయాయని, నగరానికి పట్టిన దరిద్రం పోయిందని అన్నారు. అప్పటి తెలంగాణ ప్రభుత్వం ఏ పథకం ప్రవేశం పెడితే వెంటనే పెద్దల మెప్పుకోసం ఆ పథకాన్ని పీర్జాదిగూడ నగరంలో ఎవరి అనుమతి లేకుండా ఇష్టారాజ్యాంగా నిధులను ఖర్చు చేస్తూ దివాలా తీయించాడు. అతని ధోరణి నచ్చకే మెజారిటీ కార్పోరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరామని తెలిపారు. ఈ 5 నెలలు కష్టపడి పనిచేసి, పీర్జాదిగూడ నగరాన్ని ఒక రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులను కలిసి అభివృద్ధికి సహకరించే విధంగా వివరిస్తూ నిధులను మరింతగా తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పీర్జాదిగూడ కమాన్ రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని, ఎస్ ఎన్ డి పి ప్రాజెక్ట్ పనులు ముందుకెళ్లే విధంగా చర్చలు జరుపుతామని అన్నారు. అదేవిధంగా మేయర్ గా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రతి డివిజన్ లో క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సహకరించిన కార్పొరేటర్ లందరికీ, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పీర్జాదిగూడ నగర ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, కార్పొరేటర్లు బొడిగె స్వాతికృష్ణ గౌడ్, భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, మాడుగుల చంద్రకళ చంద్రారెడ్డి, పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి, తూముకుంట్ల ప్రసన్న లక్ష్మి శ్రీధర్ రెడ్డి, కుర్ర శాలిని శ్రీకాంత్ గౌడ్, కొడే పోచయ్య, బండి రమ్య సతీష్ గౌడ్, కె. సుభాష్ నాయక్, బండారి మంజుల రవీందర్, బచ్చరాజు, యాసారం మహేశ్వరి మహేష్, వీరమల్ల సుమలత, పాశం శశిరేఖ బుచ్చి యాదవ్, అలువాల సరిత దేవేందర్ గౌడ్, పిట్టల మల్లేష్, మద్ది యుగేందర్ రెడ్డి, ఎంపల్ల అనంతరెడ్డి, బి. శారద, కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి, చెరుకు వరలక్ష్మి పెంటయ్య, ఇర్ఫాన్ ఖాన్, దర్గా దయాకర్ రెడ్డి, దేశగోని శ్రీనివాస్ గౌడ్, పాశం రాజు యాదవ్, సునీల్, ప్రశాంత్, అశోక్ రెడ్డి, కె.వి గౌడ్, యువ నాయకులు చిలుముల అజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పచ్చదనంతో కాలుష్య నియంత్రణ



▸▸ పచ్చదనం స్వచ్ఛ ధనం నిరంతర ప్రక్రియ... అందరూ భాగస్వామ్యం కావాలి.

✍ జయభేరి, హైదరాబాద్:

నగరాన్ని స్వచ్ఛ పచ్చ నగరంగా మార్చాలన్న ధ్యేయంతో ముందుకు వెళ్తున్నామని, అందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు.స్వచ్ఛ ధనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాసబ్ ట్యాంక్ లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి కాట, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ లు పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. కాలుష్య రహిత సమాజానికి పాటు పడాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ఈ ఐదు రోజుల పాటు అన్ని వర్గాల ప్రజలకు పరిశుభ్రత, పచ్చదనం పై పెద్ద ఎత్తున అవగాహన కల్పించామని తెలిపారు. నగరంలోని అన్ని కాలనీలలో,గార్బేజ్ పాయింట్లలో గార్బేజిని, సి అండ్ డి వేస్ట్ ను క్లీన్ చేయడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా నగరంలో ఈ సంవత్సరం 50 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 13 లక్షల మొక్కలు నాటడం పూర్తయిందని తెలిపారు. సచ్చదనం పచ్చదనం నిరంతరంగా కొనసాగుతుందని అదేవిధంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని, అప్పుడే భవిష్యత్ తరాలకు స్వచ్ఛ గాలిని అందించ గలుగుతామన్నారు.

డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కాలుష్య రహిత సమాజానికి పాటుపడాలని కోరారు. ఆరోగ్యకర జీవనానికి పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, మొక్కలు నాటాలన్నారు. గ్రేటర్ లో ఫారెస్ట్ విస్తీర్ణం పెరిగినట్లు నట్లు డిప్యూటీ మేయర్ అన్నారు. నగరంలో ప్రజల ఆహ్లాద రంగా పచ్చదనాన్ని పొందించేందుకు కృషి చేస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అవసరమాన్నారు. కమిషనర్ ఆమ్రపాలి కాట మాట్లాడుతూ.. నగరాన్ని పరిశుభ్ర స్వచ్ఛ నగరంగా అభివృద్ధి చేసుకోవడం అందరి సామాజిక బాధ్యతని అన్నారు. నగర వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలన్నారు. చెట్లను రక్షిస్తే చెట్లు మనని రక్షిస్తాయని పేర్కొన్నారు. పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చని దోమలతో వ్యాప్తి చెందే వ్యాధులను నియంత్రించగలుగుతామని తెలిపారు. హైదరాబాద్ నగరం పూర్తి పరిశుభ్రత, పచ్చదనం సంతరించుకునేలా అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం సందర్భంగా గ్రేటర్ లో 38 లోకేషన్స్ లలో ప్రజా ప్రతినిధులు సహకారంతో మొక్కలు నష్టినట్లు ప్రజలకు అవడమైన మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఇప్పటి వరకు ,సుమారు5.5 లక్షల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వన మహోత్సవం సందర్భంగా 38 లోకేషన్స్ లో సుమారు 15 వేల మొక్కలు నాటినట్లు కమిషనర్ ఆమ్రపాలి కాట పేర్కొన్నారు.అంతకు ముందు కళాశాల ఆవరణలో మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, నాంపల్లి శాసనసభ్యులు మొక్కలు నాటారు. అధికారులు, విద్యార్థులు, కార్పొరేటర్లు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.అనంతరం విద్యార్థులకు, కాలని వాసులకు ఈ సందర్భంగా మొక్కలను పంపిణీ చేశారు .ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, యు బి డి అడిషనల్ కమిషనర్ సునంద, యు బి డి మేనేజర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్, కళాశాల ఉద్యోగులు,విద్యార్థులు, ఎల్ఐసి ఉద్యోగులు, ఎన్ సి సి స్టూడెంట్స్, కార్పొరేటర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## జీవో 33 పై ఆందోళన

చేశారు. ఎంబీబీఎస్ / బీడీఎస్ కోర్సుల ప్రవేశాల్లో స్థానికతపై వివరణ ఇచ్చారు.

మంత్రి ప్రకటనలో ప్రస్తావించిన విషయాలు :

తెలంగాణ మెడికల్, డెంటల్ కాలేజీ ప్రవేశాల (ఎంబీబీఎస్ & బీడీఎస్ కోర్సుల కోసం ప్రవేశాలు) నిబంధనలు 2017, ఉత్తర్వులు (జీవో 114) జారీ చేయబడ్డాయి. దీని ప్రకారం రాష్ట్రానికి 85 శాతం సీట్లను కేటాయించారు. 15 శాతం సీట్లను ఆల్ఇండియా కోటా (AIQ) కోసం కేటాయించారు.

రాష్ట్రానికి కేటాయించిన 85 శాతం సీట్లలో, 15% సీట్లు విడిగాపెట్టబడ్డాయి అంటే ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ విద్యార్థులు అర్హులు. ఈ సదుపాయం AP State Reorganization Act 2014 ప్రకారం 2.6.2024 వరకు మాత్రమే విస్తరించబడి ఉంది.

2.6.2024 నుంచి తెలంగాణకు కేటాయించిన 85 శాతం సీట్లను తెలంగాణకు చెందిన విద్యార్థులతోనే భర్తీ చేయాలి. 15 శాతం విడిచిపెట్టిన సీట్లను (G.O.33 Dt.19.7.2024) తొలగించడం ద్వారా... అదనంగా 299 ఎంబీబీఎస్ సీట్లు, 188 బీడీఎస్ సీట్లు ప్రత్యేకంగా తెలంగాణ విద్యార్థులకు కేటాయించబడ్డాయి. G.O లో ఉన్న నిబంధన స్థానిక స్థితి గురించి, స్థానిక ప్రాంతంలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివినట్లు ఈ G.O లో ప్రస్తావించబడింది.

2.6.2024 వరకు జీవో 114 అమల్లో ఉంది. ఈ G.O ప్రకారం స్థానిక అభ్యర్థిగా పరిగణించడానికి రెండు నిబంధనలు ఉన్నాయి.

a) స్థానిక ప్రాంతంలో 6వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదివాలి.

b) అభ్యర్థి స్థానిక అభ్యర్థిగా పరిగణించబడలేదంటే, అతను/ఆమె తెలంగాణలో ఏదైనా నాలుగు సంవత్సరాలు చదివి, మిగిలిన కాలం AP లోని ప్రాంతంలో (AU ప్రాంతం మరియు SVU ప్రాంతం) చదివితే... అతను/ఆమె స్థానికంగా పరిగణించబడతాడు.

కాబట్టి అభ్యర్థి తెలంగాణలో ఏదైనా నాలుగు సంవత్సరాలు చదివి, మిగిలిన కాలం AP లోని ప్రాంతంలో (AU ప్రాంతం, SVU ప్రాంతం) చదివి ఉంటే... అతను/ఆమె తెలంగాణలో స్థానికంగా పరిగణించబడతాడు. AP Reorganization Act యొక్క సెక్షన్ 95 ప్రకారం.... ఈ సదుపాయం 2.6.2024 నుంచి క్రమంగా నిలిపివేయబడుతుంది. కాబట్టి ప్రభుత్వం http://G.O.Ms.No.33 Dt.19.7.2024 ను జారీ చేసింది. రెండవ క్లాజును తొలగించి మొదటి క్లాజును కొనసాగించింది. పై ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు... చట్ట సలహా తీసుకోబడింది. విద్యార్థి తెలంగాణకు చెందిన వ్యక్తి కానప్పటికీ రాష్ట్రానికి కేటాయించిన సీటు తెలంగాణకు చెందిన అభ్యర్థితోనే భర్తీ చేయబడుతుంది. పై పారా 5(b) ఉమ్మడి AP మరియు SVU ప్రాంతంలో చదివిన విద్యార్థులకు మాత్రమే వర్తించేది. ఇది పొరుగు రాష్ట్రాలలో చదివిన విద్యార్థులకు వర్తించేది కాదు. ఇప్పుడు ఈ సదుపాయం ఉమ్మడి AP, SVU ప్రాంతంలో చదివిన విద్యార్థులకు నిలిపివేయబడింది. ఏపీ రీఆర్గనైజేషన్ యాక్ట్ ప్రకారం స్థానిక ప్రాంతంలో 10 సంవత్సరాల విస్తరణ కాలం 02.06.2024 న పూర్తి అవుతుంది" అని మంత్రి దామోదర తన ప్రకటనలో వివరించారు.

# కాంగ్రెస్ పాలనలో పీర్జాదిగూడను ఆదర్శంగా అభివృద్ధి చేస్తాం..

- శరవేగంగా "పీర్జాదిగూడ కమాన్-పర్వతాపూర్" రోడ్డు విస్తరణ పనులు
- శంకుస్థాపన చేసి 20 నెలలు గడిచిన పట్టించుకోని గత ప్రభుత్వం
- రోడ్డు విస్తరణకు సహకరించిన అధికారులకు,నాయకులకు,ప్రజలకు కృతజ్ఞతలు.
- పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తుంగతుర్తి రవి



**జయభేరి, మేడిపల్లి :**

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పీర్జాదిగూడ కమాన్ పర్వతాపూర్ ప్రధాన రహదారి నాలుగు లైన్ల విస్తరణ పనులకు 28 కోట్ల నిధులతో శంకుస్థాపన చేసిన గత పాలకుల పూర్తి నిర్లక్ష్యం కారణంగా సుమారు 2 సంవత్సరాలు కావస్తున్న ఎక్కడి గొంగడి అక్కడే అన్న చందంగా పనులు ముందుకు సాగక ప్రజలు అనేక ప్రమాదాలకు గురి అవుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి చొరవతో అన్ని డిపార్ట్మెంట్ల అధికారులతో, నాయకుల, ప్రజల సహకారంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులను శుక్రవారం తుంగతుర్తి రవి పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ పాలనలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో అనేక అవినీతి అక్రమాలు, జరిగాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన అద్భుతంగా కొనసాగుతుందని అందుకు నిదర్శనంగా నేడు పీర్జాదిగూడ పర్వతాపూర్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం అయ్యాయని, అతి త్వరలో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారని తుంగతుర్తి రవి అన్నారు. రానున్న రోజుల్లో పీర్జాదిగూడ కార్పొరేషన్ రాష్ట్రంలోనే అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. కార్పొరేషన్ అభివృద్ధిలో సహకరిస్తున్న టిపిసిసి ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులకు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని తుంగతుర్తి రవి అన్నారు.



## లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం

- స్వచ్ఛదనం పచ్చధనం కార్యక్రమంలో అందరు భాగస్వాములు కావాలి : ప్రత్యేక అధికారి సైదులు

**జయభేరి, ఆగస్టు 9:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట మండలం లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సైదులు, ఎంపిడివో మమతబాయి, ఎంపివో వినూత్న పాల్గొన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మరియు గ్రామాల్లో పచ్చదనం పెంపొందించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఈ సందర్భంగా వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి , రెవిన్యూ అధికారులు, ఆశ వర్కర్లు, ఏ ఎన్ ఎం లు, అంగన్ వాడీ సిబ్బంది, బిల్ కలెక్టర్అభిలాష్ రెడ్డి,రంజిత్ గౌడ్, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడ గడ్డపై ఎగిరిన "కాంగ్రెస్" జెండా

- నూతన మేయర్"అమర్ సింగ్"కు తుంగతుర్తి రవి శుభాకాంక్షలు
- పిర్జాదిగూడ అభివృద్ధి లక్ష్యంగా నూతన పాలకవర్గం కృషి చేస్తుంది



**జయభేరి, మేడిపల్లి :**

పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పెట్టిన అవిశ్వాస తీర్మానంలో 21 మంది కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు నూతన మేయర్ గా "అమర్ సింగ్"కు సంపూర్ణ మద్దతు తెలిపారు.దీంతో కీసర ఆర్డీవో అవిశ్వాసంలో కాంగ్రెస్ పార్టీ నెగ్గినట్లు తెలియజేశారు.కాంగ్రెస్ పార్టీ పక్షాన టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్,మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలో "అమర్ సింగ్" ను మేయర్ గా ప్రకటించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి స్పందిస్తూ నాలుగున్నర ఏళ్లుగా బిఆర్ఎస్ పాలకుల ఏకపక్ష నిర్ణయాలు,అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ పార్టీ సందించిన అవిశ్వాస అస్త్రం నేడు విజయవంతమైందని.నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ పార్టీ మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ల సారథ్యంలో నూతన పాలకవర్గం పీర్జాదిగూడ అభివృద్ధి,ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ,గత కొన్ని నెలలుగా మేయర్ పీఠం కోసం సాగుతున్న ఈ పోరులో పాల్గొన్న ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ నూతన మేయర్ గా ఎన్నికైన అమర్ సింగ్ కు, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులందరికీ తుంగతుర్తి రవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## కురుమలకు అండగా ఉంటాం

- బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- మేయర్, డిప్యూటి మేయర్ ను కలిసిన పిర్జాదిగూడ కురుమ సంఘం నాయకులు

**జయభేరి, మేడిపల్లి, ఆగస్ట్09 :**



కురుమలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు.శుక్రవారం బోడుప్పల్ నగర మేయర్, మేయర్ డిప్యూటీ మేయర్ లను వారి నివాసంలో పీర్జాదిగూడ కురుమ సంఘం నాయకులు కలిసి శాలువాతో సన్మానించారు.ఈ సంధర్భంగా ఫీర్జాదిగూడ కార్పొరేషన్ లో నిర్మాణంలో ఉన్న శ్రీ బీరప్ప దేవాలయం కొరకు నిధులు ఇచ్చేందుకు సహకారం అందించాలని కోరారు. దీనికి వారు సానుకూలత వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు, ఈస్ట్ బోడుప్పల్ కురుమ సంఘం మాజీ అధ్యక్షుడు ఆసర్ల బీరప్ప కురుమ, మేడిపల్లి మండల కురుమ సంఘం గౌరవాధ్యక్షుడు, జర్నలిస్ట్ మరాటి మల్లేష్ కురుమ, ఫీర్జాదిగూడ కురుమ సంఘమ నాయకులు జోగు సోమయ్య కురుమ, మద్దూరి యాదగిరి కురుమ, నోముల శ్రీనివాస్ కురుమ, దేవునూరి గోవింద్ కురుమ, గుంటి సాగర్ కురుమ, మద్దూరి రాజు కురుమ, కృష్ణ మూర్తి కురుమ తదితరులు పాల్గోన్నారు.

## మత్స్యకారులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి

- ముదిరాజ్ లను బీసీ డీ నుండి బీసీ ఏ లోకి మార్చాలి
- ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు మంద స్వామి

**జయభేరి, ఆగస్టు 9:**



ముదిరాజు కులస్తులను బిసి 'డి' నుండి బీసీ 'ఏ' లోకి మార్చాలని కోరుతూ మేడ్చల్ జిల్లా ఉమ్మడి శామీర్ పేట్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కావలి శంకర్ ఆధ్వర్యంలో తహశీల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సీనియర్ నాయకులు మంద స్వామి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం మొత్తం జనాభాలో ఎక్కువ శాతం ముదిరాజు కులస్తులే ఉన్నారని, అదేవిధంగా ఎక్కువ పేదరికంలో ఉన్న వారు కూడా ముదిరాజులేనని సమాజంలో ఉన్నత సామాజిక, ఆర్థిక, రాజకీయ , రంగాలలో వెనుకబడిన వారు కూడా ముదిరాజులేనని అన్నారు. మత్స్య వృత్తి లో ముదిరాజులకు ప్రత్యేక హోదా కల్పించాలని తెలంగాణలో మృత్య అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి దానికి ముదిరాజులనే చైర్మన్ గా నియమించాలని కోరారు. గత 2023 శాసనసభ ఎన్నికల్లో 'అభయ హస్తం ' పేరుతో ఇచ్చిన హామీలో ముదిరాజులను బిసి డి నుంచి బీసీ ఏలోకి మార్చాలని, గతంలో సుప్రీంకోర్టు రాష్ట్ర బీసీ కమిషనర్ ద్వారా పరిష్కరించడానికి ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. తక్షణమే బీసీ కమిషనర్ ఆదేశాలు జారీ చేసి ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శామీర్ పేట్ మండల ఉపాధ్యక్షుడు దుర్గం వెంకటేష్, గోల్డ్ శ్రీనివాస్, కట్టెల రవి, రవికాంత్, పండగ బాలు, వెంకటస్వామి, సత్యనారాయణ, మహేష్ అర్జున్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛదనం - పచ్చదనం కర్యక్రమం



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ, 14వ, 21వ డివిజన్ లలో స్వచ్ఛదనం - పచ్చదనం కర్యక్రమంలో పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కమీషనర్, స్థానిక కార్పొరేటర్లు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**



## ఛలో ఒంగోలు.. రాష్ట్ర దళిత సంఘాల సమావేశం

**జయభేరి, కైకలూరు:**

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి రాష్ట్ర దళిత సంఘాల కార్యాలయంలో ది 9/8/24 రాష్ట్ర మాల మహానాడు మరియు అనుబంధ సంఘాల అధ్యక్షులు డాక్టర్ సేవా. నాగ జగన్ బాబురావు ఏర్పాటు చేసినటువంటి సమావేశంలో బాబురావు మాట్లాడుతూది 11/8/24 ఆదివారం ఒంగోలులో డాక్టర్ దాసరి చెన్నకేశవులు రావు గ్లోబల్ రిపబ్లిక్ అండ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా బాబాసాహెబ్ అంబేద్కర్ మనవడు డాక్టర్ భీమారావు యశ్వంత్ అంబేద్కర్ జాతీయ గ్లోబల్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు ముఖ్యఅతిథిగా వస్తున్నారు కాబట్టి ఆ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి పార్టీలకు అతీతంగా భారీగా బయలుదేరి వెళ్లాలని దాసరి చెన్నకేశవులు రావు తను చేస్తున్నటువంటి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి బాబాసాహెబ్ అంబేద్కర్ రక్తసంబంధీకుడైనటువంటి యశ్వంత్ ఏర్పాటు చేసినటువంటి పార్టీని రాష్ట్రవ్యాప్తంగా బలోపేతం చేసి మనకంటూ ఒక పార్టీ ఉండాలని చెన్నకేశవులు రావు పోరాడుతున్నటువంటి పోరాటానికి నా సంఘం పూర్తిగా మద్దతు ఇస్తుందని అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి ప్రజలందరూ మీటింగ్ కు హాజరు కావాలని బాబురావు పిలుపునివ్వడం జరిగింది.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా కార్యవర్గ సమావేశం



**జయభేరి, కైకలూరు:**

భారతీయ జనతాపార్టీ మండవల్లి మండల కార్యవర్గ సమావేశం మండవల్లి లో సాయంత్రం గం: 4లకి సాయిబాబా ఆలయం వద్ద శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ ఆదేశాలతో మండల అధ్యక్షులు సమయం ఏసుబాబు అధ్యక్షతన జరిగింది, ముఖ్య అతిథిలుగా జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణా రావు పాల్గొని మార్గదర్శనం చేశారు, భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పార్టీ పిలుపు మేరకు "" హర్ ఘర్ తిరంగా "" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి పైన జాతీయ జెండాను ఎగురవేసే విధంగా చూసి ప్రజల్లో జాతీయ స్ఫూర్తి పెంపొందే విధంగా ప్రతి కార్యకర్త గ్రామ గ్రామాన కృషి చేయాలని, అందేవిధంగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగస్వామ్యం కావడం , ప్రభుత్వ పథకాల ఫలితాలు అర్హులైన వారికి లబ్ధిచేకూరేలా చూడటం మరియు ప్రజా సమస్యలపై స్పందించడం ద్వారా నిరంతరం ప్రజల కోసం పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ శ్యమలరాజ్ గౌడ్ ,మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, బండి రంగారావు బోను ఈశ్వరరావు కోనపురెడ్డి శ్రీనివాసరావు, పేరం భార్గవ్ ,బండి దివాకర్ , ,మునగాల రమేష్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు, షేక్ మీరావలి , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం పూజలు



**జయభేరి, దేవరకొండ :**


దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం అభిషేకం సామూహిక లక్ష పుష్పార్చన కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్య శర్మ వారి శిష్య బృందం జై వైభవంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ అధ్యక్షులు చీదల్ల వెంకటేశ్వర్లు కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ కోశాధికారి కొత్త సుబ్బారావు ఇల్లందుల బుచ్చి రాములు ఇమ్మడి భద్రయ్య ఎచ్చ చంద్రయ్య గార్లపాటి దామోదర్ నేలంటి ధనంజయ గట్టు మోహనయ్య దొడ్డి రామ్మోహన్ కర్నాటి పురుషోత్తం సముద్రాల సహదేవ్ సముద్రాల వేణు మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభించిన వైస్ చైర్మన్ రహత్ అలీ



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉర్దూ మీడియంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ రహాత్ అలీ శుక్రవారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. ఆధార్ కార్డులు ప్రస్తుతం కేవలం గుర్తింపు కార్డులగానే కాకుండా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ప్రధానంగా ఉందని అన్నారు.ఆధార్ ప్రతి ఒక్క దానికి అవసరం కావడంతో, దేవరకొండ జనాభా కి అనుగుణంగా ఆధార్ నమోదు కేంద్రాలు లేకపోవడంతో పట్టణంలో కొన్నేళ్లుగా ఆధార్ సేవల కోసం ప్రజలు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. కార్డులోని ఫోటోలను అప్డేట్ చేసుకొనేందుకు అవకాశం ఉందని అన్నారు.ఆధార్ నమోదు కేంద్రం ద్వారా ఆధార్లో 10 వేలి ముద్రలు, 2 ఐరిస్ ప్రింట్లు మరియు ముఖం యొక్క ఫోటో అప్డేట్ చేసుకోవాలని, పట్టణ, పరిసర ప్రాంత ప్రజలకు త్వరితగతిన సేవలు అందుబాటులో ఉంటాయని, పట్టణ ప్రజలు, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శంషుద్దీన్, హమీద్, ఫెరోజ్, ఆధార్ నమోదు కేంద్ర యజమాని సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.




# మూవీభేరి



## కావ్యం లాంటి సినిమా

'ఇందులో నా పాత్ర పేరు ధరణి. చాలా హైపర్‌గా అల్లరిగా ఉంటా. ప్రతి అమ్మాయి తనకు తాను రిలేట్ చేసుకునేలా నా పాత్ర ఉంటుంది. చాలా బ్యూటిఫుల్ క్యారెక్టరైజేషన్. ఇదొక అందమైన కావ్యం లాంటి సినిమా. అద్భుతమైన స్క్రిప్ట్. మంచి సినిమా చేశానని సంతృప్తిగా ఉంది' అని కథానాయిక మోక్ష ఆనందం వ్యక్తం చేసింది. యువహీరో కృష్ణవంశీకి జోడీగా ఆమె నటించిన చిత్రం 'అలనాటి రామచంద్రుడు'. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమావతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఆగస్ట్ 2న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మోక్ష సోమవారం విలేకరులతో ముచ్చటించింది. 'ఈ పాత్ర కోసం చాలా హార్డ్ వర్క్ చేశా. సెకండాఫ్ అంతా మనాలీలో సాగుతుంది. చలికాలం మైనస్ డిగ్రీలలో షూట్ చేశాం. ఈ కథలో నేచర్ ఫిలాసఫీ ఉంది. దాన్ని క్యాప్చర్ చేయడం సవాల్‌తో కూడుకున్న విషయం. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు ఈ పాత్ర నాకోసమే పుట్టిందనిపించింది. ఆయన విజన్ ఉన్న దర్శకుడు. చాలా హానెస్ట్‌గా తీశారు. అమలాపురం, వైజాగ్‌లో కొంత భాగం షూటింగ్ చేశాం. అక్కడి జనం నన్ను సొంత కూతురిలా చూసుకున్నారు. సంగీత పరంగా, సాహిత్య పరంగా, టేకింగ్ పరంగా కొత్త అనుభూతిని పంచే సినిమా ఇది. అందరికీ నచ్చుతుంది' అంటూ నమ్మకం వ్యక్తం చేసింది మోక్ష.



## సొంతంగా డబ్బింగ్ చెప్పేసింది

సినిమా విడుదలకు ముందే స్టార్ స్టేటస్‌ని సొంతం చేసుకున్నది భాగ్యశ్రీ బోర్సే. ప్రస్తుతం ఈ అందాలభామ డేట్స్ కోసం నిర్మాతలు క్యూ కట్టారనేది ఫిల్మ్‌వర్గాల టాక్. రవితేజ హీరోగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'మిస్టర్ బచ్చన్' ద్వారా ఈ ముద్దుగుమ్మ కథానాయికగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 15న సినిమా విడుదల కానుంది. అందుకే మిగిలివున్న వర్క్‌ని చకచకా పూర్తి చేస్తున్నారు చిత్రబృందం. తాజాగా భాగ్యశ్రీ తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పేసుకొని తన బాధ్యతను పూర్తి చేసేసుకుంది. తన మాతృభాష తెలుగు కాకపోయినా కష్టపడి నేర్చుకొని తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పడంతో అందరూ భాగ్యశ్రీని అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఆమె డెడికేషన్ని ప్రశంసిస్తున్నారు. ఇప్పటివరకూ విడుదలైన ప్రచారచిత్రాల్లో భాగ్యశ్రీ బోర్సే స్క్రీన్ ప్రెజెన్స్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచిందని, ఎక్కడ చూసినా ఆమె ఫొటోలే వైరల్ అవుతున్నాయని, విడుదలకు ముందే టాలీవుడ్ అప్ కమింగ్ క్రేజీ హీరోయిన్ అంటూ ఆమెను కొనియాడుతున్నారని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌కు చిరంజీవి కీలక సూచన..!



తెలుగు పరిశ్రమకు చెందిన ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూషర్స్ కౌన్సిల్‌కు మెగాస్టార్ చిరంజీవి కీలక సూచనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని సినిమా అవార్డులను పునరుద్ధరిస్తూ.. పరిశ్రమలోకి ప్రభావవంతులకు ప్రజాకళాకారుడు గద్దర్ పేరిట ప్రతియేటా 'గద్దర్ అవార్డులు' ఇస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని ప్రకటించారన్నారు. తెలుగు పరిశ్రమ తరపున, ఫిలిం ఛాంబర్, ప్రొడ్యూషర్స్ కౌన్సిల్ ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని కోరుతున్నానంటూ మెగాస్టార్ ట్వీట్ చేశారు. గతంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి సినిమా పరిశ్రమలో నంది అవార్డుల స్థానంలో గద్దర్ పేరిట అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా సీఎం స్పందించారు. రవీంద్రభారతిలో డాక్టర్ సినారె 93వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం.. గద్దర్ పేరిట అవార్డులు ఇస్తామని ప్రకటించినా చిత్ర పరిశ్రమ తమని స్పందించలేదని పేర్కొన్నారు. గతంలో ఇదే వేదిక నుంచి గద్దర్ పేరిట అవార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించినా సినీ రంగ ప్రముఖులు తమను సంప్రదించలేదన్నారు. నంది అవార్డుల స్థాయిలో ఆయా కార్యక్రమాలను చేపడుతామని.. ఇప్పటికైనా సినీ ప్రముఖులు ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్తే ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఈ క్రమంలోనే చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందించారు. మరి ఇప్పుడైనా సినీ పరిశ్రమ పెద్దలు ప్రభుత్వాన్ని కలుస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.



## తంగం అంతరంగం హాయిగా..

'ఆర్ఆర్ఆర్' వచ్చి రెండేండ్లు నిండి మూడో ఏడు నడుస్తున్నది. ఇంకా ఎన్టీఆర్ నుంచి సినిమా రాలేదు. ఆయన అభిమానుల్ని బాధిస్తున్న విషయం ఇది. తారక్ మాత్రం ఖాళీగా లేకుండా ఇటు 'దేవర'తో అటు 'వార్'తో బిజీబిజీగా ఉన్నారు. ఎట్టకేలకు 'దేవర 1' షూటింగ్ తుదిదశకు చేరుకుంది. ఈ సినిమాతో ఫ్యాన్స్‌కి వండర్‌ఫుల్ ట్రీట్ ఇచ్చేందుకు దర్శకుడు కొరటాల శివ సిద్ధమవుతున్నారు. తాజాగా ఎన్టీఆర్, జాన్వీకపూర్‌లపై ఓ అద్భుతమైన రొమాంటిక్ సాంగ్‌ని చిత్రీకరించారు కొరటాల. ఈ పాటను త్వరలోనే మేకర్స్ విడుదల చేయనున్నారు. రామజోగయ్యశాస్త్రి ఈ పాట రాశారు. తాజాగా ఆయన తన ఎక్స్‌లో (ట్విటర్) ఈ పాట గురించి స్పందించారు. 'తంగం అంతరంగం హాయిగా ఉయ్యాలలూగుతున్నట్టుంటుంది.. ఇప్పుడే విన్నా.. అతి త్వరలో సాంగ్ వచ్చేస్తోంది.. వెయిట్ చేసినందుకు మంచి ఫలితం ఉంటుంది.' అనేది ఈ ట్వీట్ సారాంశం. మొత్తానికి ఒక్క ట్వీట్‌తో అభిమానుల్లో అంచనాలు పెంచేశారు రామజోగయ్యశాస్త్రి. ఇందులో జాన్వికపూర్ పాత్ర పేరు 'తంగం'. ఆమె పేరు మీదే ఈ పాట నడుస్తుందని శాస్త్రి క్లారిటీ ఇచ్చేశారు. తంగం అంటే తమిళంలో బంగారం అని అర్థం. ఏదేమైనా సెప్టెంబర్ చివరివారంలో సినిమా విడుదల కానుంది. ఇది హిట్ అయిన వెంటనే 'దేవర 2' షూటింగ్ మొదలవుతుంది. ఇందులో సైఫ్‌అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com